# నిరంతర ద్వయం

హోటలు నాలుగో అంతస్థులో గదులేవీ లేవు.

అంతా ఖాళీ స్థలమే!

విశాలమైన మిద్దెపైన, వో మూలాగా, రెండు పేము కుర్చీలు వేయించాను. మధ్యలో చిన్న టీపాయ్. చూసేవాళ్లు అనుమాన పడకుండా, యెందుకైనా మంచిదని, దానిపైన చిన్న ట్రేలో నాలుగు జామపళ్లు పెట్టించాను. కుర్చీలో కూచుని, పొడవాటి పేనా కత్తిని చేతిలోకి తీసుకుని, పదును పరీక్షిస్తూ, ఖాళీగా వున్న యెదుటి కుర్చీని చూడసాగాను. కాస్సేపటిలో ఆ కుర్చీలో కూచోబోయే వ్యక్తిని గుర్తుచేసుకుని, కత్తి పిడిని వొడిసి పట్టుకుని, కసిగా, ఆనందంగా, నాలో నేనే నవ్వుకోసాగాను.

నా యెదురుగా వున్నది ఖాళీ కుర్చీ అని నాకనిపించడంలేదు. మరి కాస్సేపట్లో అతనొచ్చి కూచుంటాడనే వూహే ఆకృతి ధరించి దాన్నిండా ఆవరించినట్టూ, దానిచుట్టూ చిత్రమైన శక్తేదో పరిభ్రమిస్తున్నట్టూ నాకనిపించసాగింది.

అవసరమైతే అయిదో అంతస్థుగా విస్తరించడం కోసం సగంలో పని ఆపేసిన సిమెంటు స్తంభాలూ, వాటిపైన రకరకాల సైజుల్లో నిల్చున్న యినుప కమ్మీలూ- ఆరుబయట కూచున్నామో, యింట్లో కూచున్నామో తేల్చుకోలేకపోతున్న చిత్రమైన చోటు... పగలంతా యెండలో కాగిన సిమెంటు గచ్చు; సుదూర ప్రాంతాలనుంచీ చల్లగా వీస్తున్న సాయంకాలపు పిల్ల తెమ్మెరలు... హోటలు భవనం వెనక కాలువలో, రకరకాల పిచ్చి మొక్కలు పెరిగిన గట్టి నేలకు మధ్య, చిన్న యిసుక మేటలో బాగా కృశించిపోయిన చిన్న మురికినీటి జాలు...

మిద్దె మెట్లపైన అడుగుల శబ్దం వినిపించింది.

అటువైపుకు తిరిగి, కత్తి పిడిని గట్టిగా పట్టుకుని, కళ్లార్పకుండా చూడసాగాను. నా

గుండె చప్పుడు నాకే స్పష్టంగా వినబడుతోంది.

పరుగ్గే నడకగా మిద్దెపై కొచ్చాడతను.

చుట్టూ వోసారి కలయజూసి, ఠీవిగా నడుముపైన చేతులుంచుకుని, ''యిదేమిటిక్కడ కూచున్నావ్?'' అని ప్రశ్నించాడు.

తనని చూడగానే నేను లేచి నిల్చుంటాననుకొని వుంటాడు. నేను కదలకుండా కూర్చున్నాను. వీలయినంతగా ఆశ్చర్యాన్ని కప్పిపుచ్చుకుంటూ, నేను కూచున్న చోటికి నడిచి వచ్చి, ''యింత తీరికగా కూచున్నావేమిటి? ఆ హోటలు మేనేజరు నన్నిలా రమ్మన్నావని చెబితే, యేదో అర్జెంటు ఫైలు చూడ్డానికేమోననుకున్నాను'' అంటూ విసుక్కున్నాడు. నేనేమీ మాట్లాడకపోవడంతో మరింత సంభ్రమానికి లోనై తడబడుతూ, ''యిక్కడ బాగుందే! క్యాంపు కొచ్చినప్పుడల్లా యీ హోటల్లోనే దిగుతున్నాను. కానీ యింత అందమైన ప్రదేశమిక్కడుందని నాకు తెలియనే తెలియదు. వెరీగుడ్'' అని తన ఆఫీసరు దర్పాన్ని వెలిగించడానికి విఫల ప్రయత్నం చేస్తూ, యెదుటి కుర్చీలో కూచున్నాడు.

యెన్నాళ్లుగానో యెదురుచూస్తున్న సమయమే అయినా, చెప్పలేనంత కంగారుగా వుంది. శల్యపరీక్ష చేస్తున్న అతడి చూపుల్ని తప్పించుకోవడం కోసం, జామపండు నొకదాన్ని చేతికందుకుని ముక్కలుగా కోయసాగాను.

''నాకు జామ పళ్లంటే యిష్టమని నీకెలా తెలిసింది? దాన్నలా కోస్తే నాకు నచ్చదు. యిలాతే చూపెడతాను'' అని నా చేతిలోని పండును లాక్కోబోయాడు.

''యిది నీ కోసం గాదు'' అని కేకేశాను. వున్నట్టుండి నాకెందుకంత కోపం వచ్చిందో అర్థంగాక అతగాడు బిక్కమొహం పెట్టాడు.

''దీన్నిప్పుడు కోస్తున్నది తిండానికి కాదు. నిన్నెలా కోసి ముక్కలు చెయ్యాలో ప్రాక్టీసు చేస్తున్నాను'' వీలయినంత నింపాదిగా చెప్పడానికి ప్రయత్నించాను.

నా యేకవచన ప్రయోగానికి మరింత నిర్ఘాంతపోయినట్టున్నాడు. కానీ అతనంత త్వరగా కొరకుడుపడే ఘటం కాదని నాకు బాగా తెలుసు. పేలవమైన నవ్వు నొకదాన్ని సరఫరా చేసి, ''భలే జోక్ చేస్తున్నావే! యింతకీ అసలు విషయం చెప్పు...'' అన్నాడు.

''జోక్గాదు. నిజమే!'' అని ఘాండ్రించాను.

అతనో రెండు నిముషాలు నాకేసి పరీక్షగా చూపులు నిగుడించిన తర్వాత, ''నీ ఆరోగ్యం బావున్నట్టు లేదు. మరెప్పుడైనా కలుద్దాం'' అని లేచి వెళ్లబోయాడు.

''కదలొద్దు... కదిలావంటే యిప్పుడే చస్తావ్'' - భీకరంగా వెలువడ్డ నా కేకకు అతడు నిలువునా వణికిపోసాగాడు. ముఖంపైన చెమట బిందువులు పొటమరించాయి. అతడలా భయపడుతుంటే నాకు చాలా ముచ్చటేసింది.

యెంత ఆపుకున్నా వినకుండా, చిరునవ్వొకటి నా పెదవులపై కొచ్చి కూచుంది.

''యింకో గంటసేపు యిటువైపుకెవర్నీ రానివ్వకుండా చూడమని మేనేజరుతో చెప్పాను. బుద్ధిగా నేను చెప్పినట్లు వింటే ఆ గంటయినా బతుకుతావ్, లేకుంటే...''

పేనా కత్తితో గాలిలో ముగ్గులేసి చూపెట్టాను.

అతను నిస్సహాయంగా కుర్చీలో సోలిపోయాడు.

నేనో జామపండు ముక్కను కొరికి చూసి, ''తింటావా'' అంటూ ప్లేటును అతని ముందుకు జరుపుతూ అదోలా నవ్వసాగాను.

అతను పళ్లనూ, నా ముఖాన్నీ మార్చి మార్చీ చూస్తూ, ''యేమిటో చెప్పు'' అన్నాడు నీరసంగా.

''యెక్కడినుంచీ మొదలుపెట్టమంటావ్?'' అని అడిగాను.

అతను మరింతగా బెంబేలు పడిపోతూ, ''నీ యిష్టం'' అని గొణిగాడు.

నేను కాస్సేపు ఆలోచించి, తరువాత నిట్టూర్చి, ''యెక్కడో వొకచోట మొదలుపెట్టక తప్పదు గదా! కాబట్టి మొదటినుంచే మొదలెడతాను. దాదాపు ముప్పయ్యేళ్ల క్రితం, వొక చిన్న పల్లెటూళ్లో, నా చిన్నతనంలో- నాకప్పుడు తొమ్మిదేళ్లుండవచ్చు - అప్పుడు ప్రారంభమయిందీ కథ...'' అని ప్రారంభించాను.

''మా నాన్నో చిన్న వుద్యోగి. ఆ వూరి ప్రెసిడెంటు యింట్లో, వొక పోర్షన్లో, మేముండే వాళ్లం. మా యింట్లో మనం ఆడింది ఆట, పాడింది పాట. యేడుపులూ, నిరసన వ్రతాలూ, పలాయనాలూ మన ఆయుధాలు. యథేచ్ఛగా సాగిపోతున్న నా పరిపాలనకు పక్కింట్లోనే పక్కలో బల్లెంలా దాపురించాడొకడు. యేడవడం కూడా చేతగాని దద్దమ్మ. పుస్తకం తప్ప మరొకటి తెలియని వాజమ్మ. నేను కదిలితే చాలు, మెదిలితే చాలు, మా అమ్మ 'పక్కింటి కుర్రాణ్ణి చూసయినా బుద్ధి తెచ్చుకో'' అని కసిరేది. 'ఆ అబ్బాయి కెప్పుడూ ఫస్టురాంకే! నువ్వు వున్నావెందుకు, దండుగ?' అని మా నాన్న గీపెట్టేవాడు...''

కళ్లార్పడం మినహాయిస్తే అతనిలో మరో చలనమేమీ లేదు.

''సరిగ్గా అప్పుడే జరిగిందొక సంఘటన'' అంటూ కొనసాగించాను -

''మా నాన్న స్నేహితుడొకడు యేదో పనిమీద మా వూరొచ్చాడు. రెండు రోజు లున్నాడు. తిరిగి వెళ్లబోయేముందు తన సూట్‌కేసులోంచీ పెద్ద తుపాకీ బొమ్మను పైకి తీశాడు. మా యింట్లో దిగినవాడు, మా అమ్మ చేసి పెట్టిన వంట మూడుపూటలూ దట్టించినవాడు, ఆ బొమ్మ తుపాకీని న్యాయంగా యెవరికివ్వాలి? నాకే గదా!... ఆ ప్రబుద్ధుడు పొరుగింటి వాణ్ణి పిలిచి 'భద్రంగా దాచిపెట్టు. నువ్వయితే కుదురుగా వుంటావని నీ చేతికిస్తున్నాను. ఆడుకోడం మాత్రం యిద్దరూ ఆడుకోవాలి'' అని యేర్పాటుచేసి వెళ్లాడు. వున్నదేమో వొకే బొమ్మ. యిద్దరెలా ఆడుకోవడం? అందులోనూ ఆ రాహువుగాడు - అదే మా పక్కింటివాడు - న్యాయంగా తనది కాని దాన్ని దొంగిలించే స్వభావం వున్నవాడు గదా! అందుకనే వాడికా పేరు పెట్టాన్నేను - యెలాంటివాడు?

బొమ్మను తీసుకెళ్లి వాళ్ల మూలింటి అలమార్లో వుంచి తాళం తగిలించేశాడు. యేడ్చి ఆగడం చేస్తే రెండు నిముషాలు నా చేతిలో వుంచేవాడు. వొకరోజు, యింట్లో యెవరూ లేని సమయం చూసి, తాళం లాగి, తుపాకీ బొమ్మని పెద్దరాయితో నలగ్గొద్ది యేమీ తెలియనట్టుగా అక్కడే వుంచేసి వచ్చేశాను. తరువాతెప్పుడూ వాడు నాకా తుపాకీని చూపెట్టలేదు. నేనూ అడగలేదనుకో, అది వేరే విషయం...''

ఘాఢమైన మరపుతెరని బలవంతంగా చింపడం కోసమన్నట్టుగా అతడి చూపులు పదునెక్కుతున్నాయి.

''నేను అయిదో తరగతి పాసయ్యాను. రాహువూ పాసయ్యాడు. వాణ్ణి టౌనుకు పంపాలనీ, కాన్వెంటులో చేర్పించాలనీ వాళ్లమ్మా నాన్నా నిర్ణయించారు. అప్పటికి మనమేనా తక్కువ తిన్నది? నేనూ కాన్వెంటులో చేరాలని మొరాయించాను. ఆ వూరునుంచి టౌనుకు పదిమైళ్ల దూరం. బస్సులైతే వున్నాయిగానీ, యెప్పుడొస్తాయో, యెప్పుడు వెళ్తాయో చెప్పలేం! ఆ వూరు నుంచీ రోజూ మోపెడ్లో టౌనుకెళ్లే బ్యాంకు వుద్యోగి వొకాయనుండేవాడు. యెవరైనా వొక కుర్రాణ్ణి మాత్రం తనతోబాటూ రోజూ టౌనుకు తీసుకెళ్లడానికి ఆయనొప్పుకున్నాడు. నేనే వెళ్లాలని పట్టుబట్టాన్నేను. తానేం తక్కువ తినలేదన్నాడు వాడు. సంప్రదింపులు మొదలయ్యాయి. గెలుపు నాదేనని అనిపించింది మొదట్లో. చివర్లో వాళ్లేదో కుతంత్రం పన్నారు. వాడు రాహువు మాత్రమే గాదు. కేతువుకూడా! వాడే కాన్వెంటులో చేరాడు. నా తల తొక్కినట్టుగా, రోజూ, నా కళ్లముందే మోపెడెక్కే వాడు. నేనేమో పల్లెటూరి బడిలోనే వుండిపోయాను...''

అతడి ముఖంలో క్రమంగా రంగులు మారడం స్పష్టంగా కనబడుతోంది. నేను కాస్సేపు ఆపేసరికి, వుత్కంఠ నాపుకోలేక పైకి లేచి, బిగ్గరగా వుచ్ఛ్వాస నిశ్వాసాల్ని వదులుతూ, ''అయితే నువ్వేనన్నమాట!'' అంటూ నన్ను లేపి కౌగిలించుకో బోయాడు.

''అక్కడే ఆగు. నా ముందు నాటకాలు వద్దు...'' అంటూ హూంకరించి, ''కడుపులో లేనిది, కౌగిలించుకుంటే వస్తుందా? ఆ తరువాత వాడేమయ్యాడో విచారించావా అసలు?'' అని ఆక్రోశించాను.

''యేమో! చదువులూ, పరీక్షలూ, రాంక్‌లూ, స్కాలర్‌షిప్పులూ - యీ గొడవల్లో అవన్నీ పట్టించుకునే తీరికెక్కడిది నాకు? వాళ్ల నాన్నకి బదిలీ అయి యెక్కడికో వెళ్లిపోయారని తెలిసింది. అంతే! యింతకూ వాడు నువ్వేనా కాదా? ఆ సంగతి తేల్చు'' అంటూ అతను మళ్లీ కుర్చీలో కూర్చున్నాడు.

''అప్పుడే యేమయ్యింది? యింకా చాలా విషయాలు బాకీ వున్నాయి. అవి కూడా విను. తరువాత నిజమేమిటో నీకే తెలుస్తుంది. యీ లోకంలో రాహుకేతువులే గాదు. యింకా చాలామంది రాక్షసులున్నారు. యీసారి నాకడ్డు తగిలిన వాడికి నేను పెట్టిన పేరు హిరణ్యాక్షుడు. భూమిని చుట్ట చుట్టుకుని చంకలో పెట్టుకుందామనుకున్నవాడు గదా హిరణ్యాక్షుడు. వీడూ వాడిలాగే, వీలయితే, చదువునంతా యింకొకరికి దక్కనివ్వకుండా

దోచేసుకోవాలని ఆరాటపడేవాడు. అవి నేను కాలేజీలో చేరిన రోజులు. సంవత్సరం గడవక మునుపే మన పేరు ప్రఖ్యాతులు మారుమోగిపోయాయి. స్పోర్ట్సు ఛాంపియన్ షిప్పులూ, అథ్లెటిక్ మీట్ కప్పులూ అన్నీ మనవే! మా ఫిజికల్ డైరెక్టరూ, ప్రిన్సిపాలూ నేనుండటం కాలేజీకి గర్వకారణమని పులకించి పోసాగారు. యెలెక్షన్లయితే విద్యార్థులు కొట్టుకుంటారని ఆ పద్ధతిని రద్దుచేసి, ఆ సంవత్సరం నామినేషన్ పద్ధతిని ప్రవేశపెట్టారు. ఆటల్లో ఫస్టయిన నన్ను ప్రెసిడెంటును చేయాలని కొందరు లెక్చరర్లు పట్టుబట్టారు. చదువుల్లో రాణిస్తున్న హిరణ్యాక్షుణ్ణి ప్రెసిడెంటును చేయాలని యింకొందరు ఆరాటపడ్డారు. చదువా? ఆటలా? ఛాంపియనా? రాంక్ హోల్డరా? అదీ ప్రశ్న? కథ మళ్లీ మొదటిసారిలాగే ముగిసింది. చివర్లో యెవరో అడ్డుపుల్లేశారు. హిరణ్యాక్షుడే ప్రెసిడెంటయ్యాడు''.

జేబులోంచీ సిగరెట్టు పెట్టెను పైకితీసి, లైటర్‌తో సిగరెట్టు వెలిగించుకువి, రెండు దమ్ములాగాను. జారిపోయిన జ్ఞాపకాల తీగల్ని అంది పుచ్చుకునే ఆరాటంలోనే కొట్టుమిట్టాడుతున్నట్టు కనిపిస్తున్నాడు అతనింకా.

''ఆ సంవత్సరం ఆఖర్లో యెన్నెస్సెస్ వాళ్ల మిస్సోరీలో క్యాంపు యేర్పాటుచేశారు. మా కాలేజీనుంచీ వొకర్ని పంపమని వుత్తర్వులందాయి. నన్ను పంపాలని డైరెక్టరూ, హిరణ్యాక్షుడ్ని పంపాలని ప్రిన్సిపాలూ కీచులాడుకున్నారు. నాకడ్డు తగులుతున్న ఆ పాపాత్ముడు కనిపిస్తే వొక పట్టుబట్టి చూపించాలని అనుకున్నాను. వాడు కనిపించలేదు. రెండోసారయినా న్యాయం జరగకపోతే బావుండదని తర్వాత నన్నే మిస్సోరీకి పంపారనుకో అది వేరే విషయం! ఆ హిరణ్యాక్షుడి వల్లే గదా, నాకన్ని రోజుల మథన...''

సిగరెట్టెందుకో యివ్వాళ చేదుగా తోస్తోంది. విసుగ్గా కిందికి గిరవాటేశాను.

''చదువూ, ట్యూషన్లూ, లైబ్రరీలూ, కోచింగులూ - యీ హడావిడిలో వున్నానేమో! వున్నట్టుండి నన్ను ప్రెసిడెంటును చేసినట్టు తెలిసింది. యీ తతంగ మంతా నా చెవిన పడనే లేదు. మిస్సోరీకి వెళ్లాల్సిన చాన్సు నాకు తప్పిపోయిందని యెవరో వాపోతుంటే విన్నాను. యింతలో పరీక్షలొచ్చేశాయి. ఆ సంగతి మరచిపోయాను. యింతకూ మా పక్కింటి కుర్రాడూ, స్పోర్ట్సు చాంపియనూ - యిద్దరూ నువ్వేనా? లేకపోతే...'' అతనింకా సందేహిస్తూనే వున్నాడు.

''ముగింపు కోసం అంత తొందరెందుకు? యింకా మనం సగంలోనే వున్నాం. యీసారి నాకడ్డు తగిలిన రాక్షసుడిపేరు నరకాసురుడు. కాలేజీ చదువు పూర్తయ్యాక యూనివర్శిటీకి యెంట్రన్సు రాశాను. హిస్టరీలో చేరాలని నా కోరిక. యెందుకైనా మంచిదని యెకనమిక్సుకూడా అప్లయి చేశాను. మొదట హిస్టరీకి యింటర్వ్యూ వచ్చింది. యెన్నెస్సెస్ కోటాలో నా పేరుంది. నాతో బాటూ యింకొకడున్నాడా లిస్టులో. నేనేమో రెండు క్యాంపుల కెళ్లాను. వాడికేమో మార్కులెక్కువ. సీటు వాడే కొట్టేశాడు. నా అవకాశాన్ని నరికేశాడు కాబట్టి వాడికి నరకాసురుడని పేరు పెట్టాను. చివరకు నాకు యెకనామిక్సే శరణ్యమయింది...''

అతడు నా సిగరెట్టు పెట్టెలోంచీ సిగరెట్టు పైకి లాగి, నా లైటరుతోనే వెలిగించుకుని అన్యమనస్కంగా తాగసాగాడు.

''వొకోసారి యేది మంచో యేది కీడో ముందుగా మనం తెలుసుకోలేం.. తీరా యెకనామిక్స్‌లో చేరాక గానీ నక్క తోక తొక్కి వచ్చానన్న సంగతి నాకర్థం గాలేదు. అవును మరి. హిస్టరీలో చేరివుంటే ప్రియను కలవడమెలా జరిగేది? ఆమెను చూడ్డానికే రోజూ కాలేజీకెళ్లేవాణ్ణి. మా స్నేహితులంతా నన్ను ప్రియ బాడీగార్డనే పిలిచేవాళ్లు. ఆమె కూడా అప్పుడప్పుడూ నాకేసి చూసి చిరునవ్వు నవ్వేది. మా ప్రేమ ఫలించబోతోందనగా శిశుపాలుడొకడు అడ్డు తగిలాడు. వాడింకా చదువుతూనే వున్నాడు. డిగ్రీ కూడా చేతికిరాక మునుపే వాడికేమంత తొందరొచ్చిందో - పెళ్లికి సిద్ధమై కూచున్నాడు. ప్రియ అయినా యెదురు తిరుగుతుందనీ, నా దగ్గరికి పరిగెత్తుకొచ్చేస్తుందనీ యెదురుచూశాను. కొంచెం ముందుగా చొరవ తీసుకుని ఆమెనం ముగ్గులోకి దించనందుకు నన్ను నేనే నిందించుకున్నాను. చివరకు ప్రియ పెళ్లి శిశుపాలుడితోనే జరిగిపోయింది.

అతడు కుర్చీలో వెనక్కి వాలిపోయి కూర్చున్నాడు! ముఖంలో మునుపటి తడబాటు తగ్గిపోయింది. నుదటిపైన వంకర టింకరగా సాగిన రేఖలు పరధ్యానంగా వున్నట్టు తెలుపుతున్నాయి.

''నువ్వు చెబుతున్నది సుష్మ ప్రియ గురించే గదా!'' యీసారి అతడి మాట సూటిగా, బులెట్‌లా దూసుకొచ్చింది.

నేనతడి ప్రశ్నను పట్టించుకోకుండా చెప్పుకుపోసాగాను - ''యేం చదివానో, యెలా పరీక్షలు రాశానో నాకే తెలియదు. చివరి కెలాగో పాసయిపోయినట్టుగా రిజల్ట్సు వచ్చాయి. డిగ్రీ చేతికి రాగానే వుద్యోగాలకు అప్లయి చేశాను. వో యింటర్వ్యూ వచ్చింది. చివరి వడపోతలో యిద్దరు అభ్యర్థులు మిగిలారు. నేనూ, యింకొకడూ! వాడికి నేను పెట్టిన పేరు సైంధవుడు. వాడికి ఫస్టుక్లాసుంది. నాకున్నదేమో సెకండ్ క్లాసే! వాడు ఆఫీసరుగా సెలక్టయ్యాడు, నేను అసిస్టెంటుగా సర్దుకోవాల్సి వచ్చింది...''

''అన్నిటికీ నేనే కారణమని అనుకోవడం నీ మూర్ఖత్వం. యెవరికి అర్హతలెక్కువుంటే వాడికే పెద్ద వుద్యోగం రావడం న్యాయం...'' అతను మళ్లీ అడ్డు తగిలాడు.

నేను వినిపించుకోకుండా చెప్పసాగాను. ''వుద్యోగంలో చేరిన సంవత్సరం తర్వాత మా ఆఫీసుకో వుత్తరం వచ్చింది. యెవ్వరైనా వొకరిని ఫారిన్ ట్రెయినింగ్‌కు పంపమని వుత్తర్వు. యెవరిని పంపాలి? సైంధవుణ్ణే పంపితే ఆఫీసు పనులాగిపోతాయి. నన్ను పంపితే పై వుద్యోగిని అవమానించి నట్టవుతుంది. యెవరిని పంపాలి? అదీ వాళ్ల సమస్య. కానీ యీసారి యీ సమస్యని పరిష్కరించే అవకాశాన్ని యితరులకు వదిలిపెట్టబోవడం లేదు నేను... యిన్నాళ్లూ పాసివ్‌గా వుండిపోయాను. యిక జడుడిగా వుండటం నాచేతగాదు. ప్రతిసారీ, ప్రతి జీవితపు మలుపులోనూ నాకడ్డు తగులుతున్న యీ కలుపు మొక్కల్ని పీకి పారేయాలి...'' కత్తికంటిన జామకాయ మరకల్ని రుమాలుతో తుడుస్తూ పళ్లు పటపట

కోరికాను.

అతను మరోసారి దీర్ఘంగా నిట్టూరుస్తూ, ''యిలా ప్రతిసారీ నీ కడ్డు తగులుతున్న వ్యక్తి వొక్కడే అని నీకు ముందునుంచీ తెలుసునన్న మాట!'' అన్నాడు.

''ప్రతిసారీ గెలుపు తనదే అవుతున్నప్పుడు గమనించాల్సిన అవసరం ఆవతలివాడి కెందుకుంటుంది? వోడిపోతున్నవాడి బాధ, మధన, యాతన, నిస్సహాయత వాడికెందుకర్ధ మవుతుంది? మొదటినుంచీ నీడలా వెంటాడుతూనే వున్నావు గదా నువ్వు? రాముడ్ని రావణుడూ, కృష్ణుడ్ని నరకుడూ శిశుపాలుడూ, సూర్యచంద్రుల్ని రాహుకేతువులూ, అర్జునుణ్ణి సైంధవుడూ, నన్ను నువ్వూ... అదీ వరస. అయితే యీ కలికాలంలో మనిషెప్పుడూ రాక్షసుడి చేతుల్లో వోడిపోతూనే వున్నాడు. యీ దురన్యాయం యింకా యిలా కొనసాగడానికి వీల్లేదు. దీనికీ రోజున ఫుల్‌స్టాప్ పెట్టేస్తాను'' భీకరమైన నవ్వొకటి నా నుంచి ప్రసారమై నాకే సంభ్రమాన్ని కలిగించింది.

చిన్న దగ్గుతో గొంతు సవరించుకున్న తర్వాత అతను మెల్లగా మొదలుపెట్టాడు - ''చిన్నతనంలో బొమ్మ తుపాకీని పాడుచేసిన వాడూ, నేను కాన్వెంటు కెళ్లడానికి కారకుడైన కుర్రాడూ, కాలేజీలో ప్రెసిడెంటు పదవికి పోటీపడ్డ వ్యక్తీ, యెన్నెస్సెస్ క్యాంపును తన్నుకుపోయిన వాలంటీరూ, యూనివర్సిటీలో సుష్మ ప్రియను ప్రేమించిన మనిషీ - వీళ్లంతా వేర్వేరు వ్యక్తులనే అనుకున్నానింతవరకూ. యెంత గుడ్డివాణ్ణి నేను! నేనెంత మూర్ఖుణ్ణి. యింతకాలం కళ్లు మూసుకునే బతికాను కదా నేను! యింత చిన్న విషయం గూడా నాకింతవరకూ స్ఫురించలేదు గదా! కళ్లకు గంతలు కట్టిన గుర్రానికీ నాకూ తేడా యేముంది? యంత్రంలా పరిగెత్తడమొకటే తెలిసింది గానీ, యెందుకిలా జరుగుతోంది, దీనికంతా కారణమెవరు - అనే చిన్న ప్రశ్న నాకు తోచలేదెందుకు? స్వంత ఆలోచన లేని బతుకేం బతుకు?'' అతను వాపోసాగాడు.

''చూశావా జీవితమెంత చిత్రమైందో'' మళ్లీ వోసారి బిగ్గరగా నవ్వేశాను.

''కల్పనకంటే విచిత్రంగా వుంది గదా యీ సంగతి. ప్రతిచోటా, ప్రతిసారీ, ప్రతి దానికీ పోటీపడే వాళ్లుండటం సహజం. అలా పోటీ పడే వాళ్లందరూ వొకటే గావడం చిత్రాతి చిత్రమైన నిజం. యిలాంటి సమయాల్లోనే నేను నిన్ను చూసి నవ్వుతున్నట్టుగా, జీవితం సాహిత్యాన్ని చూసి పకపకా హేళన చేస్తూ నవ్వుతుందను కుంటాను...'' ఆవేశమూ, ఆలోచనా వొక దాన్నొకటి పెనవేసుకుపోయిన ఆ చిత్రమైన క్షణంలో విచిత్రమైన వూహలు నాపైన దాడి జరపసాగాయి. ''కానీ యీసారి జీవితమే నా ముందు వోడిపోతుంది. అందరూ వొకడేగావడం వల్ల నా పని సులువై పోయింది. వీళ్లందరూ వేర్వేరు వ్యక్తులైవుంటే యేం జరిగివుండేది? నా ముందిప్పుడు వొక కుర్చీకి బదులుగా అనేకానేక కుర్చీలుండేవి. వాటిలో నీలాంటి అనేకానేక శరీరాలు నా కత్తి కోసం వేచి చూడాల్సి వచ్చేది. వూహించ డానికే ఆ దృశ్యం అద్భుతంగా వుంది గదా!...''

అతను నింపాదిగా, అడవిలో తప్పిపోయిన దారిని వెతికి పట్టుకునే బాటసారిలా

తడబడుతూ, ఆగి ఆగీ మాట్లాడుతూ, ''నీ ధోరణి నాకంతుబట్టడం లేదు. వున్మాదానికి అంచుల్లో నడుస్తున్నట్టున్నావ్... కానీ ఆలోచించి చూస్తే నీ మాటల్లో, యిదివరకూ నేను గమనించని సత్యమేదో దాగివున్నట్టు అనిపిస్తోంది. అంతా గందరగోళంగా వుంది. మళ్లీ మొదటినుంచీ మొదలెడదాం. యీ కథ తుపాకీ బొమ్మతో ప్రారంభమయ్యిందని కదా నీ వుద్దేశ్యం?'' అని ప్రశ్నించాడు.

''నిజానికైతే అంతే! కానీ నాకు అప్పుడప్పుడూ విచిత్రమైన వూహొకటి కలుగుతూ వుంటుంది. చిన్నతనంలో మా అమ్మా నాన్నా విసుక్కునే తీరు చూస్తే వాళ్లు నిజమైన తల్లిదండ్రులు కారేమోననీ, నన్నేదో అనాథ శరణాలయంనుంచో, వేరే యేదో తెలియని లోకంలోంచో తెచ్చి పెంచుకున్నారనీ అనిపిస్తూ వుంటుంది. ఆ మాట వొకటి రెండుసార్లు పైకే అని మా అమ్మా నాన్నా దగ్గర చీవాట్లు తిన్నాను గూడా! ఆ వూహే మరింతగా విస్తరించేదప్పుడప్పుడూ. యేదో పేరు తెలియని లోకంలో మనిద్దరమూ చిన్న పిల్లలుగా వున్నప్పుడు మీ అమ్మా నాన్నా మా అమ్మా నాన్న అక్కడికెళ్లినట్టూ, మొదట నన్నే వాళ్ల యింటికి తెచ్చుకోవాలని మీ అమ్మా నాన్న అనుకున్నట్టూ, యింతలో యెవరో యేదో పన్నాగం పన్నడంతో నా స్థానంలోకి నువు వచ్చేసినట్టూ... చూశావా, నీకు నవ్వొస్తున్నట్టుంది. నన్ను పిచ్చివాడని అనుకుంటున్నావు కదా నువ్వు!''

కోపంతోనూ, అసహనంతోనూ వణకసాగాన్నేను. మాటలు స్పష్టాస్పష్టంగా వెలువడ సాగాయి.

''అదేం లేదు. నిన్ను పిచ్చివాడని అనేవాడే నిజమైన పిచ్చివాడు'' చివాలున అడ్డు తగిలాడతను - ''నిన్ను చూస్తుంటే నాకు చెప్పరానంత గౌరవం కలుగుతోంది. నీ తెలివితేటల ముందు నేనెందుకూ పనికిరాను... కాస్సేపు వోపిక పట్టు. తరువాత నీ యిష్టం. ముందిలా చూడు...'' అతను తన కుడిచేతిని నా ముందుకు చాపాడు. చేతికి రెండంగుళాల కింద పెద్ద తెల్లటి చార కనబడుతోంది.

''ఆ బొమ్మ తుపాకీని నీకు దొరక్కుండా అలమారులో దాచి పెట్టాను గదా! చాలా రోజుల తర్వాత వొకనాడు, నువ్వులేని సమయం చూసి, దానితో ఆడుకోవాలనుకున్నాను. దాన్ని నువ్వు పాడుచేసిన విషయం నాకప్పుడు తెలియదు. తీరా ట్రిగ్గర్ నొక్కితే, స్ప్రింగొకటి విరిగి, చేతిని విసిరికొట్టింది. యెంత గాయం తగిలిందో చూశావా? యింజెక్షన్లూ, టానిక్కులూ, మాత్రలూ, మొత్తం రెండు నెలలు పట్టింది మానడానికి. ఆ బొమ్మ వల్లే యిదంతా జరిగిందనీ, దాన్ని ఆ పాపాత్ముడు నీకే యిచ్చి వెళ్లుంటే పీడా విరగడై వుండేదనీ మా అమ్మ చాలా రోజులపాటూ శాపనార్థాలు పెట్టింది...''

నిజంగా నాకు చెప్పలేనంత ఆనందం కలిగింది. బలవంతంగా నవ్వు నాపుకుంటూ, వుత్సాహాన్నీ అణిచి పెట్టుకోవడానికి విఫలయత్నం చేయసాగాను.

''ఆ బ్యాంకు క్లర్కుకు మీ నాన్నంటే యెందుకో కోపమట! మీ నాన్న పైన పగ తీర్చుకోవడం కోసం నన్ను రోజూ కాలేజీకి తీసుకెళ్లాడు. వొక సంవత్సరమలా తిప్పాక

అతడికి మోజు తీరిపోయింది. యింతలో మీ నాన్నకు బదిలీ అయింది. నాకు టౌనులో హాస్టలే గతయ్యింది. హాస్టలులో వున్నప్పుడు రోజూ నాకు మా అమ్మే జ్ఞాపకం వచ్చి యేడుపొచ్చేది. నేను పదవ తరగతి చదువుతోండగా మా అమ్మ చనిపోయింది. కాన్వెంటు చదువులంటే మోజు పడిన నన్నూ, చిన్నపిల్లాడిననయినా చూడకుండా హాస్టల్లో చేర్పించిన నాన్ననూ, రోజూ టౌనుకు తీసుకెళ్ళడానికి సిద్ధమైన ఆ క్లర్కునూ, యీ రోజు వరకూ తిట్టుకుంటూనే వున్నాను. మా అమ్మ ఆఖరిరోజుల్లో ఆమెదగ్గర వుండలేకపోయాననే బాధ యింకా నన్ను పట్టి కుదుపుతోంది. వాళ్లనీ వీళ్లనీ నిందించానుగానీ యిప్పుడర్థమౌతుంది నాకు. యెంతో విలువైన అమ్మ ప్రేమ నీ మూలంగానే నాకప్పుడు దక్కలేదు. నువ్వు పోటీకి రాకపోతే ఆ క్లర్కు నా సంగతి పట్టించుకునేవాడు కాడు''

నేను వులిక్కిపడ్డాను.

ఆశ్చర్యంగా వుంది అతని వాదన వింటూంటే!

''కాలేజీలో చదువుతప్ప మరొకటి పట్టించుకోని నన్ను కావాలని ప్రెసిడెంటును చేసి దారి మళ్లించారు. రాంక్ పోయింది. యెన్నెస్సెస్ క్యాంపు గురించి నేనప్పుడంతగా పట్టించు కోలేదు. కానీ యిప్పుడు బోధపడుతోంది. నేషనల్ క్యాంపు పేరుతో నీకేమో విందులూ వినోదాలూ, ప్రెసిడెంట్‌షిప్ పేరుతో నాకేమో బరువులూ బాధ్యతలూ...''

కాస్సేపాగి మళ్లీ చెప్పసాగాడు.

''యూనివర్శిటీలో యెవరో రౌడీ సుష్మప్రియ వెంటబడేవాడట! ఆ పిల్ల యింట్లో మొరబెట్టుకుంది. యీడొచ్చిన పిల్లకు వెంటనే పెళ్లి చేసేయాలని వాళ్లమ్మా నాన్నా అనుకున్నారు. వాళ్ల నాన్నా మా నాన్నా స్నేహితులు. మంచి సంబంధం చేయిదాటి పోగూడ దని మా నాన్న పంతం పట్టి కూచున్నాడు. యెంత మొరబెట్టుకున్నా వినకుండా, చదువైనా పూర్తిగాక మునుపే, నాకు పెళ్లి చేసేశారు...''

మళ్లీ నాకు చెప్పలేనంతగా కోపంవచ్చింది. కత్తిని చేతపట్టుకుని లేవడానికి సిద్ధమయ్యాను. అతను మాత్రం నాకేసి చూడనైనా చూడలేదు. చెప్పుకుపోతూనే వున్నాడు.

- ''పెళ్లయిన రెండేళ్లకే ప్రియకూ నాకూ గొడవలు మొదలయ్యాయి. కారణాలు పెద్దవి గావనుకో, కానీ అప్పుడప్పుడూ చిలికి చిలికీ గాలివాన తయారయ్యేది. పిచ్చి పట్టినట్టుగా వుండేది నాకు. ఆమెదంతా జబర్దస్తీ, పెద్ద గీర. మొగుడనే వాడు సేవకుడిలా ఆమెకు దాస్యం చేయాలని ఆమె సిద్ధాంతం. యూనివర్శిటీలో తన వెంటబడి తిరిగిన రౌడీ కుర్రాణ్ణే పెళ్లాడి వుంటే పువ్వుల్లో పెట్టుకుని పూజించేవాడని ఆమె వాదన. యింతకూ ఆ బాడీగార్డువి గూడా నువ్వేనన్నమాట!'' అని కాస్సేపాగి, ''యింకొంచెం ముందుకు ప్రొసీడ్ కాలేక పోయావా? నువ్వే ఆమెగారిని పెళ్లాడి వుంటే, నేను బతికిపోయేవాణ్ణి!'' అని నిట్టూర్చాడు.

నా చేతిలోని కత్తి వణకసాగింది. దాన్ని టీపాయ్ పైకి విసిరికొట్టాను.

''యిదంతా నీ వల్లనే! చూశావా, యిప్పుడంతా స్పష్టంగా అర్థమవుతోంది నాకు. నువ్వు

లేకుంటే నా చేతికి గాయం తగిలి వుండేది కాదు. మా అమ్మ దూరమయ్యేది కాదు. రాంక్ పోయేది కాదు. పెళ్లాం గుదిబండలా మెడకు చుట్టుకునేది కాదు. నన్ను అనుక్షణం నీడలా వెంటాడుతూనే వస్తున్నావు నువ్వు! వెనక్కి తిరిగి చూడటం చేతగాని వెధవని నేను...''

అతనలా బాధపడుతూంటే ముచ్చటా, ఆందోళన పడుతూంటే భయమూ వొకేసారిగా ముప్పేటగా నన్నావరించసాగాయి.

''అంతా నీ మూలంగానే జరిగింది. నువ్వు మనిషివి కాదు. రాక్షసుడివి. నూరుమంది రాహు కేతువులూ, వేయివంది నరకులూ, లక్షమంది హిరణ్యాక్షులూ, కోటిమంది సైంధవులూ నీ ముందు బలాదూర్! నీలాంటి రాక్షసుడు బతికి వుండటానికి వీల్లేదు...'' టీపాయ్ పైని కత్తిని వొడిసి పట్టుకుని, తుఫానులో చిక్కుకున్న నావలా వూగిపోతూ, నాకేసి గబగబా అడుగు వేయసాగాడతను.

మేడమెట్లపైన పెద్దగా చెప్పుల శబ్దం వినిపించింది. మేమిద్దరమూ వులిక్కిపడి, అలాగే శిల్పాల్లా నిలబడిపోయి, అటువైపుకు తిరిగి చూడసాగాము.

హడావుడిగా పైకొచ్చిన హోటలు మేనేజరు మా యిద్దరినీ వోసారి యెగాదిగా చూసి, తానూ వో క్షణం సేపు అలాగే నిలబడిపోయాడు. అంతలో తేరుకుని, ''జామపండును కోయడం పైన కొత్తకొత్త ప్రయోగాలేమైనా చేస్తున్నారా సార్ మీరు!'' అంటూ పడీ పడీ నవ్వసాగాడు. మా యిద్దరి చూపులూ వొకసారిగా పేనా కత్తి పైన నిలచాయి. నేను విసిరేసినప్పుడు అది జామపండులోకి దిగబడి నట్టుంది. యింకా పండలాగే కత్తి మొన పైన నిలబడి చోద్యం చూస్తోంది. కత్తి మొన పైనుంచీ మా చూపులు జారి పరస్పరం పలకరించుకుని, అసహాయంగా రెప్పల క్రింద నక్కి కూచున్నాయి.

''పండును కోయడానికీ, నరకడానికీ తేడా వుంది సార్!'' అంటూ మేనేజరు అతడి చేతిలోని కత్తిని తన చేతిలోకి తీసుకుని బుద్ధిగా పండును ముక్కలు చేయసాగాడు.

తాళ్లు తెగి ముళ్ల కంపల్లో తగులుకున్న గాలిపటాల్లా, మేమిద్దరమూ పేము కుర్చీల్లో సోలిపోయి రొప్పసాగాము.

జామపండు ముక్కనొకదాన్ని తానూ రుచి చూసి, ''మరచిపోయాను సార్! యిక్కడ షస్టయిపోయింది కాబట్టి రూము ఖాళీ చేస్తామని చెప్పారట గదా! మీ కోసం బస్సు టికెట్లు తెమ్మని మావాడ్ని బస్టాండుకు తరిమాను. వాడొక తుగ్లక్! రాత్రి పదిగంటలకు వెళ్లే చివరి బస్సులో వొకే వొక టికెట్టు మిగిలిందట! యెందుకైనా మంచిదని ఆ వొక టిక్కెట్టే రిజర్వు చేయించుకొచ్చాడు వాడు. మీ యిద్దరిలో యెవరికర్జంటయితే వాళ్లు, యీ రోజు వెళ్లండి. మిగిలిన వాళ్లకు రేపు వుదయం వెళ్లే బస్సులో రిజర్వు చేయిస్తాను'' అని బస్సు టికెట్టును టీపాయ్‌పైన వుంచి, అది గాలికెగిరి పోకుండా జామపండు ముక్కను పేపర్‌వెయిట్‌లా దానిపైనుంచి, పేనా కత్తిని మడిచి పరధ్యానంగా తన జేబులో వేసుకుని, చెప్పులు శబ్దంచేస్తూ కిందికెళ్లిపోయాడు హోటలు మేనేజరు.

''ఆఫీసులో నా ఫారిన్ ట్రిప్ నిర్ణయమై వుంటుంది. నేనే వెళ్తాను'' అన్నాడతను.

''నువ్వు లేకుంటే ఆ చాన్సు నాదే కదా!'' అని హుంకరించాను.

రెండు నిముషాలు తర్వాత, ''నువ్వు పోగొట్టుకున్నదేదీ నాకు అచ్చి రాలేదు. నీ బదులుగా నేను బయలుదేరితే యేమవుతుందో యేమో! ఆ బస్సుకు ఆక్సిడెంటవుతుందేమో! నీ కంటే ముందుగా వెళ్తే యేదో పనికిరాని పని కాళ్లకు చుట్టుకుని వదలిపెట్టనని మొరాయిస్తుందేమో! నువ్వే వెళ్లు. నేను రేపు వెళ్తాను'' అన్నాడతను.

నేను కాస్సేపు ఆలోచించి, ''నీతో పోటీకి దిగిన ప్రతిసారీ నాకు మరచిపోలేనంత పెద్ద యెదురుదెబ్బ తగుల్తోంది. నువ్వు వదిలిపెట్టినదేదీ నన్ను సుఖంగా వుండనివ్వలేదు. నీ బదులు నేనెందుకు వెళ్తాను?'' అని వాదించాను.

''యింతకూ ఆ ఫారిన్ ట్రిప్ మాత్రం సవ్యంగా ముగుస్తుందని నమ్మకమేముంది? తీరా నేను విదేశాల్లో వున్నప్పుడు, యిక్కడ యింటర్వ్యూలు జరిగి నువ్వే బాస్ అయిపోతే? నాకు బాగా అర్థమైపోయింది. ముందెప్పుడూ అదృష్టం నన్నే వరించినట్టుగా వూరిస్తూ వుంటుంది. తీరా కొంతకాలం గడచాక అదే దురదృష్టమై వేధించుకుతింటుంది'' అంటూ రెండు చేతుల్లోనూ ముఖాన్ని దాచుకున్నాడతను. అతడినలా చూస్తుంటే చెప్పలేనంత జాలేసింది నాకు. నిస్సహాయంగా విలవిల్లాడి పోతున్న ఆ అభాగ్యుణ్ణి చూస్తుంటే నాకు కళ్లల్లో నీళ్లు తిరిగాయి. వెళ్లి అతణ్ణి చేతుల్లోకి తీసుకుని వోదార్చాలని కూడా అనిపించ సాగాంది. సలహా యివ్వడం కోసం బలవంతంగా గొంతు పెగల్చుకుని, ''పోనీ నువ్వు...'' అని అంతలో యేదో స్ఫురించడంతో ఆగిపోయాను.

మరి కాస్సేపటి తర్వాత అతను కూడా కళ్లు తుడుచుకుంటూ, ''మరి... పోనీ నువ్వు కూడా...'' అని, తర్వాత గొంతుకకేదో అడ్డం పడినట్టుగా ఆగిపోయాడు.

అనంతరం వొకదాన్నొకటి వూరించుకునే వాస్తవమూ కల్పనల్లా, నిజమూ స్వప్నాల్లా, జీవితమూ సాహిత్యాల్లా, మేమిద్దరమూ అలాగే యెదురెదురుగా వొకరి నొకరు చూసుకుంటూ కూర్చుండిపోయాం.

యెదురుగా టీపాయ్‌పైన, జామపండు ముక్కకింద, గాలి వీచినప్పుడల్లా బస్సు టికెట్ యెగతాళి చేస్తున్నట్టుగా పటపట లాడసాగింది.

*(రచన మాసపత్రిక : డిసెంబర్ '94)*